సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



కార్టూన్ శివా'నందం'
కార్టూనిస్ట్, రచయిత, కవి, జర్నలిస్టు, కళాకారుడిగా ప్రత్యేకత చాటుకుంటున్నాడు బెల్లంపల్లికి చెందిన నూతి శివానంద్.
8లో▸



కల్యాణం.. చూతము రారండి..
దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం రమాసహిత సత్యనారాయణస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.
10లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /18.0

వాతావరణం
పొద్దంతా ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి
- డీసీపీ భాస్కర్



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీసీపీ

శ్రీరాంపూర్: ప్రతీ పోలీసు విధి నిర్వహణలో క్రమశిక్షణతో పని చేయాలని మంచిర్యాల డీసీసీ భాస్కర్ సూచించారు. శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కాలనీల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. అన్ని వార్డుల్లో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా కాలనీవాసులతో సత్సంబంధాలు కలిగి ఉంటూ నేరాల నియంత్రణకు సహకారం తీసుకోవాలని వివరించారు. ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్లుగా నిర్ధారించాలన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిస్థితి, సంక్షేమ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణుచందర్, ఎస్సైలు సంతోష్, లక్ష్మీప్రసన్న పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో పోలీసులకు టచ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కార్డియాలజీ స్క్రీనింగ్‌కు సంబంధించిన ఉచిత వైద్య శిబిరాన్ని పట్టణ సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. డీసీపీ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల గుండెపోటుతో చనిపోతున్నవారు పెరుగుతున్నారన్నారు. ప్రతీ ఉద్యోగంలో ఒత్తిడి ఉంటుందని, సమర్థవంతంగా ఎదుర్కొని ముందుకెళ్లాలని సూచించారు. ఒత్తిడికి లోనుకాకుండా కుటుంబ సభ్యులకు, వృత్తికి న్యాయం చేయాలని తెలిపారు. గుండె, ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాస్టర్ హెల్త్ చెకప్‌లో భాగంగా పోలీస్ అధికారులతోపాటు 40 ఏళ్ల పైబడిన సిబ్బందికి గుండె సంబంధిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ప్రతీరోజు 20 మంది చొప్పున దాదాపు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరం నిర్వహించిన టచ్ ఆసుపత్రి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గుండె వైద్య నిపుణుడు రాజేశ్ బొర్కుండే గుండె సంబంధిత వ్యాధులపై పోలీసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, టచ్ ఆసుపత్రి వైద్యులు వికాస్, తిరుమల్‌రావు, సీఈవో రాజ్‌పాల్, మేనేజింగ్ డైరెక్టర్ మాటేటి శ్రీనివాస్, డైరెక్టర్లు శేఖర్, జాన్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో నేతకానీలకు అన్యాయం



మాట్లాడుతున్న స్వామి, రామ్మూర్తి

నస్పూర్: ఎస్సీ వర్గీకరణతో నేతకానీలకు అన్యాయం జరిగిందని నేతకాని మహర్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి, ప్రధాన కార్యదర్శి సిద్దార్థ రామ్మూర్తి అన్నారు. నస్పూర్, శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. దామాషా ప్రకారం తమకు రావాల్సిన కోటాను తమకు కేటాయించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ వివాదాస్పందంగా ఉన్నదని, ఇది భవిష్యత్తులో అస్థిత్వ పోరాటాలకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత జాతులను బీజేపీకి తాకట్టు పెట్టేలా మందకృష్ణ మాదిగ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అణగారిన వర్గాలకు అండగా ఉండాల్సిన ఆయన మనువాదులకు మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నేతకాని జనాభా ఎంత ఉందో కూడా తెలియని మాజీ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్‌నేత తమకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. నేతకాని హక్కులపై పోరాడడంలో విఫలమయ్యారని విమర్శించారు. తమ న్యాయమైన హక్కులు తమకు కల్పించకపోతే వచ్చే పంచాయతీ ఎన్నికల్లో సత్తా చూపుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి జనగామ తిరుపతి, నాయకులు జాడి యేసయ్య, జాడి కళ, ప్రేంకుమార్, సెగ్గెం చంద్రమ్మ, లక్ష్మి, జాడి రాము, తులసిరాం, బాపురావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల వేట!



వాకింగ్ చేస్తూ ప్రచారంలో పాల్గొన్న టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య

- ప్రచారం మొదలు పెట్టిన పట్టభద్రులు, టీచర్ల అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లా ఓటర్ల మద్దతుకు ప్రయత్నాలు



నరేందర్‌రెడ్డికి మద్దతుగా బెజ్జూర్‌లో ప్రచారం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 10వ తేదీ వరకు అవకాశం ఉండగా పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ 13తో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే నామినేషన్ వేసిన అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా అదృష్టం పరీక్షించుకునేందుకు బరిలో దిగుతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు ఉంది. ఈ నెల 27 పోలింగ్ జరుగనుండగా మార్చి 3న కౌంటింగ్ నిర్వహిస్తారు.

నోటిఫికేషన్‌కు ముందు నుంచే..
ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు నోటిఫికేషన్‌కు ముందు నుంచే ఉమ్మడి జిల్లాలో సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ బరిలో నిలిచే అభ్యర్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి మద్దతు కోరారు. ఇక పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిలిచే అభ్యర్థులు పట్టభద్రులతో సభలు, సమావేశాలు, సమ్మేళనాలు నిర్వహించారు. తాము ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉంటామని సంకేతాలు ఇచ్చారు. ఇక నోటిఫికేషన్ వచ్చి నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో నామినేషన్లు వేసి ఓట్ల వేటలో పడ్డారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న ఓటర్లను కలుస్తూ మద్దతు కోరుతున్నారు.

పోటాపోటీగా ప్రచారం
ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధి ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉంది. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ప్రచారం చేయాల్సి ఉండడంతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తునారు. బీజేపీ నుంచి పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్న మల్క కొమురయ్య ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ప్రచారం మొదలు పెట్టారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులతో మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పట్టభద్రుల స్థానానికి పోటీకి దిగిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఉపాధ్యాయ సంఘాల నాయకుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి నియోజకవర్గ పరిధిలో ప్రచారం చేస్తున్నారు. టీచర్స్ స్థానానికి పోటీ చేస్తున్న కూర రఘోత్తమ్‌రెడ్డితో పాటు పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ తదితరులు ప్రచార స్పీడ్‌ను పెంచారు.

ఓటర్లకు కాల్స్, మెసేజ్‌లు
పట్టభద్రులు, టీచర్ల ఓటర్లకు అభ్యర్థుల పేర్లతో కూడిన వాయిస్ కాల్స్ వస్తున్నాయి. అభ్యర్థి పేరు చెబుతూ తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నట్లుగా కోరుతున్నారు. వీటితో పాటు ఓటర్లకు బల్క్ మెసేజ్‌లు, వాట్సాప్ సందేశాలు షేర్ చేస్తున్నారు. ఒక్కో ఓటరుకు ప్రతిరోజూ కనీసం రెండు మూడు ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయని ఓటర్లు చెబుతున్నారు.

ఖరీదవుతున్న ఎన్నిక
గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి మరింత ఖరీదైన ఎన్నికలుగా మారాయి. గత ఎన్నికల్లో పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత టి.జీవన్‌రెడ్డి గెలిపొందారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తమ్‌రెడ్డి విజయం సాధించారు. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి మద్దతు ఇస్తారనేది ఆసక్తిగా మారింది. అభ్యర్థుల మధ్య పోటీ పెరగడంతో విజయంపై ఉత్కంఠ పెరుగుతోంది. ఈసారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడంతో అభ్యర్థులకు ఖర్చులు సైతం తడిసి మోపడవుతున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు సైతం రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈసారి పలువురు వ్యాపారులు, ఆర్థిక, రాజకీయ బలం ఉన్నవారు బరిలో ఉన్నారు. దీంతో ఆరేళ్ల క్రితం జరిగిన ఎన్నికలంటే ఈసారి ఖర్చు పెరుగుతోంది. ఎలాగైనా గెలవాలని ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు.

కుష్ఠు రహితమే లక్ష్యంగా..



ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహణ



కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించే పోస్టర్

మంచిర్యాలటౌన్: జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జనవరి 30వ తేదీ నుంచి ఈ నెల 13వ తేదీ వరకు స్పర్శ్ పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి రోజున ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామ, వార్డు సభల్లో కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో విద్యా సంస్థల్లో, ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు, వైద్య ఆరోగ్య శిబిరాలకు వచ్చే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఏటా కుష్ఠువ్యాధి నిర్మూలన కోసం పలు కార్యక్రమాలను చేపడుతున్నా ప్రజల్లో దీనిపై అవగాహన రావడం లేదు. దీంతో వ్యాధిని పూర్తిగా నిర్మూలించలేక పోతున్నారు. దీంతో ఈ ఏడాది ''కలిసి మనం అవగాహన పెంచుకుందాం. అపోహలను దూరం చేద్దాం, కుష్ఠువ్యాధి బారిన పడిన ఎవరూ వెనుకబడి పోకుండా చూసుకుందాం'' అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రజల్లోకి వెళుతోంది. ప్రజలకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కోసం పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లాష్‌కార్డులను గ్రామాలు, పట్టణాల్లో అంటించి, అవగాహన కల్పిస్తున్నారు.


జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల వివరాలు

సంవత్సరం	గుర్తించి చికిత్స అందించిన వ్యాధిగ్రస్తులు
2016-17	73
2017-18	37
2018-19	72
2019-20	54
2020-21	83
2021-22	25
2022-23	28
2023-24	28
2024-25	25

బయటకు చెప్పుకోలేకనే...
గతంలో జిల్లావ్యాప్తంగా జిల్లా వైద్యారోగ్యశాఖ, కుష్ఠు నిర్మూలన సంస్థ సంయుక్తంగా ఇంటింటి సర్వేలో కుష్ఠు బాధితులను గుర్తించి, వ్యాధి నివారణ కోసం అవసరమైన మందులు ఇచ్చారు. వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, నిర్ధారణ అయినా బయటకు చెబితే సామాజికంగా దూరమవుతామనే భయంతో చికిత్స తీసుకోవడం లేదు. దీంతో తమ కుటుంబ సభ్యులకు, సమీపంలో నివసించే వారికి ఈ వ్యాధి సోకడానికి కారకులవుతున్నారు. ప్రజలకు కుష్ఠువ్యాధి గురించి విస్తృతంగా ప్రచారం చేయించి, అవగాహన కల్పిస్తే ఒకరి నుంచి మరొకరికి అంటుకునే అవకాశాలు తగ్గుతాయి. ఇది అంటువ్యాధి కావడం, ఒకరి నుంచి మరొకరికి ఈ వ్యాధి సోకేందుకు 5 నుంచి 7 సంవత్సరాల సమయం పట్టనుండడంతో, ఏటా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది.

కుష్ఠు లక్షణాలు
- 'మైకో బాక్టీరియం లేప్రే' అనే బ్యాక్టీరియా వలన వచ్చే అతి సామాన్యవ్యాధి.
- చర్మానికి నరాలకు సోకుతుంది.
- చాలా నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి (ఇంక్యుబేషన్ కాలం) సగటున 3 సంవత్సరాలు పడుతుంది.
- వంశపారంపర్యం కాదు, శాపం-పాపం అంతకన్నా కాదు.
- యండీటీ(బహుళ ఔషధ చికిత్స)తో 6 నెలల నుంచి 12 నెలల్లో పూర్తిగా నయం అవుతుంది.
- చికిత్స పూర్తయిన, చికిత్స తీసుకుంటున్న రోగులలో అంగవైకల్యం ఉంటే శస్త్ర చికిత్స ద్వారా సరిచేయవచ్చు.
- కుష్ఠువ్యాధి మచ్చలు సహజ చర్మపు రంగు కన్నా తక్కువగా లేదా ఎరుపు లేదా రాగి రంగు కలిగి ఉంటాయి.
- కాళ్లు, చేతుల నరాలలో వాపు నొప్పి, బలహీనత, తిమ్మిర్లు, ముఖంపై చెవి బయట నూనె పూసినట్లు మెరుస్తున్నా
- కనుబొమ్మలపై వెంట్రుకలు రాలిపోయిన, కనురెప్పలు పూర్తిగా మూతపడక పోయినా, చేతి వేళ్లు స్పర్శ కోల్పోయి, వంకర పోవడం, చేతి మణికట్టు, పాదాలలో బలహీనత, వాలిపోవడం.

కుష్ఠు నిర్మూలనే లక్ష్యంగా..



జిల్లాలో జనవరి 30 నుంచి ఈ నెల 13వ తేదీ వరకు చేపడుతున్న స్పర్శ్‌కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు వ్యాధిపై పూర్తి అవగాహనను కల్పిస్తాం. జిల్లాలో వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. కుష్ఠు వ్యాధిని భయంకరమైన జబ్బుగా పరిగణించకుండా, ప్రజలు అర్థం చేసుకుని, వైద్య సిబ్బంది వచ్చినప్పుడు నిర్భయంగా చెప్పి, చికిత్సను పొందితే పూర్తిగా కోలుకుంటారు.
– డాక్టర్ హరీశ్‌రాజ్, డీఎంహెచ్‌వో

విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

నస్పూర్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ విమర్శించారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్ర, శనివారాల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా 5వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్, రజనీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం విడ్డూరమన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, జిల్లా, మండలాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక....
జిల్లా మహాసభల సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా ఈదునూరి అభినవ్ (నస్పూర్), అధ్యక్షుడిగా దాగం శ్రీకాంత్(బెల్లంపల్లి), ఉపాధ్యక్షురాలిగా శ్రావణి, సహాయ కార్యదర్శులుగా దినేష్, నిఖిల్, కమిటీ సభ్యులుగా హరిణి, హర్షిణి, శ్రీజ, హేమలత, రత్నవీన, సాయి, రాజ్‌కుమార్, చరణ్‌సాయి, జయప్రకాశ్, భరత్ ఎన్నికయ్యారు.



అభినవ్



శ్రీకాంత్

దొంగలు.. దొరకలే..

- శుక్రవారం మధ్యాహ్నం రూ.4.40 లక్షల క్యాష్ బ్యాగ్ అపహరణ
- సీసీ ఫుటేజీల్లో దొంగల దృశ్యాలు రికార్డు...
- 24 గంటలు గడిచినా చోరీపై స్పష్టత రానివైనం..



అనుమానితులిద్దరిలో ఓ యువకుడు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో శుక్రవారం పట్టపగలు సంచలనం సృష్టించిన క్యాష్ బ్యాగ్ చోరీ ఘటనపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగి 24 గంటలు గడిచినా దొంగలు దొరకలేదు. పోలీసులు ప్రత్యేక బృందంతో గాలిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ, దొంగల ఆచూకీ కోసం వెతుకుతున్నారు. బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం వెంకటస్వామి తన మేనకోడలు పెళ్లి కోసం శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి రూ.4.40 లక్షలు డ్రా చేశాడు. నగదు బ్యాగులో పెట్టుకుని.. దానిని బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై ఉన్న కవర్‌లో ఉంచాడు. వెంకటస్వామిని ఫాలో అయిన దొంగలు.. చాకచక్యంగా నగదు అపహరించారు. క్యాష్ బ్యాగ్ అపహరించిన దొంగల మోటార్ సైకిల్‌పై ఉడాయించారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. 24 గంటలు గడిచినా దొంగలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో బాధితుడు ఆందోళన చెందుతున్నాడు. అయితే దొంగలు ఎటువైపు వెళ్లారనేది సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా గుర్తించినట్లు సమాచారం.

క్షణాల్లో డ్రైవింగ్ చేంజ్ చేసి..
బెల్లంపల్లి అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్ వద్ద పార్కింగ్ చేసిన బైక్ నుంచి బ్యాగును తస్కరించిన దొంగలు.. ద్విచక్రవాహనంపై పారిపోయారు. చోరీ సమయంలో బ్లూ కలర్, నల్ల గీతల షర్టు ధరించి ఉన్న యువకుడు బైక్ డ్రైవింగ్ చేయగా పాత బస్టాండ్ వద్దకు వచ్చేసరికి తెల్లరంగు గీతల షర్ట్ కలిగి ఉన్న యువకుడు తలపై టోపీ ధరించి బైక్ నడిపిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. తమను గుర్తుపట్టకుండా ఉండేందుకే ఇలా డ్రైవింగ్ చేంజ్ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

ఆటోను ఢీ కొట్టిన బైక్...
క్యాష్ బ్యాగ్ అపహరించిన వెంటనే దొంగలు బైక్‌ను పాత బస్టాండ్ వైపు మళ్లించారు. ఈ క్రమంలో మటన్ మార్కెట్ వద్దకు రాగానే రోడ్ నంబర్ 4 వీధిలో నుంచి ఓ ఆటో రోడ్డు మీదకు వచ్చింది. దొంగల బైక్ ఆటోను స్వల్పంగా ఢీ కొట్టినట్లు ఆ ప్రాంతంలో అమర్చిన సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఈ సమయంలో ఓ యువకుడి టోపీ కిందపడిపోగా కాళ్ల చెప్పులు అక్కడే వదిలేసి ఆ వీధి ముందున్న డివైడర్ సందులో నుంచి బైక్‌ను కుడివైపునకు మళ్లించి పాత బస్టాండ్ వైపు వెళ్లినట్లు తెలుస్తోంది.

నేషనల్ హైవే మీదుగా పరార్..
బజారు ఏరియా నుంచి పాతబస్టాండ్ మీదుగా అగంతకులు కన్నాల జంక్షన్ వద్ద నేషనల్ హైవే రోడ్డుమీదకు వెళ్లారు. రోడ్డెక్కడంతోనే బైక్ నడుపుతున్న బ్లూ కలర్ గీతల షర్టు ధరించిన యువకుడు హెల్మెట్ పెట్టుకుని మంచిర్యాల వైపు మళ్లినట్లు హైవే పక్కన ఉన్న హోటల్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయింది. అక్కడి నుంచి ఆ ఇద్దరు యువకులు టోల్ ప్లాజా దాటి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కకుండా సర్వీసు రోడ్డు మీదుగా మందమర్రి వైపు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఏ కెమెరాలో దొంగల ముఖాలు స్పష్టంగా రికార్డు కాకుండా జాగ్రత్త పడ్డారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం



దొంగలను పట్టుకోవడానికి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. నిందితులు సంచారం చేసిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నాం. దొంగలను గుర్తించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు నిందితులు ఎవరనేది వెల్లడి కాలేదు.
– ఎస్.దేవయ్య, ఎస్‌హెచ్‌వో, వన్‌టౌన్

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్


- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, జెడ్పీ సీఈవో గణపతితో కలిసి నోడల్ అధికారులు, ఎంపీడీవోలు, ఎన్నికల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 40 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 18 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈమేరకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారుల జాబితా తయారు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసీవింగ్ కౌంటర్, అనౌన్స్‌మెంట్ స్టేజ్-1 కింద ఆర్‌వో, ఏఆర్‌వో, స్టేజ్ -2లో ఆర్‌వోలు త్వరగా నియమించాలని ఆదేశించారు. ఈనెల 10న ఉదయం స్టేజ్ 1 ఆర్‌వో, ఏఆర్‌వోలకు మధ్యాహ్నం స్టేజ్-2 ఆర్‌వోలకు మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ అందించాలని తెలిపారు. తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు, మండల పంచాయతీ అధికారులు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనను పర్యవేక్షించాలన్నారు. ఈనెల 15లోగా అధికారులు, సిబ్బంది శిక్షణ మండల కేంద్రాలలో మండల ప్రత్యేక అధికారులు సమక్షంలో పూర్తి చేయాలని సూచించారు. కమ్యూనికేషన్ ప్లాన్‌లో భాగంగా పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్, ఆర్డీవోలు, జెడ్పీసీఈవో, ఇతర అధికారులు కాంటాక్ట్ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సైతం నోడల్ అధికారులను నియమించామన్నారు. నోటిఫికేషన్ విడుదల తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వసతి గృహంలో కలెక్టర్ రాత్రి బస



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్



విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న కుమార్ దీపక్

- విద్యార్థులతో కలిసి భోజనం..
- రాత్రి వారితో కలిసి నిద్రించిన కుమార్ దీపక్

మంచిర్యాలఅర్బన్: 'ఇంగ్లిష్ మంచిగా చదువుతున్నారు.. కొంత మంది లాంగ్వేజ్‌పై పట్టు సాధించాల్సి ఉంది. పాఠంలో ఏం అర్థంకాకపోయినా మళ్లీ రాయటం.. చదవటం చేసి ఇంకా బాగా చదువుకోవాలి' అని పిల్లలకు సూచించారు కలెక్టర్ కుమార్‌దీపక్. స్థానిక సాయికుంటలోని బీసీ వసతిగృహంలో శనివారం రాత్రి బస చేశారు. ముందుగా ప్రతీ తరగతి గదికి వెళ్లి ఒక్కో విద్యార్థితో పాఠం చదివించారు. తప్పులు చదివితే సరిచేస్తూ విద్యార్థులకు భరోసా కల్పించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధతపై అవగాహన కల్పించారు. ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. వసతిగృహంలో విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉండటంతో మిగిలిన వారెక్కడ అని వార్డెన్ శ్రీహరిని ప్రశ్నించారు. ఆధార్‌కార్డు, ఇతర సర్టిఫికెట్ల పనిపై ఇంటికి వెళ్లారని వార్డెన్ తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా భోజనం ఎలా ఉంటుందని ఆరా తీశారు. హాస్టల్‌లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాత్రి విద్యార్థులతో కలిసి హాస్టల్‌లో నిద్రపోయారు. ఆయన వెంట బీసీ వెల్ఫేర్ అభివృద్ధి అధికారి పురుషోత్తంనాయక్, సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి ఉన్నారు.

క్లుప్తంగా

ఎడ్లబండిని ఢీకొన్న బైక్

• ఒకరు మృతి



సిడాం మంగేశ్ మృతదేహం

వాంకిడి: ఎడ్లబండిని బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. మండలంలోని కోపగూడ గ్రామానికి చెందిన సిడాం మంగేశ్ (35) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసుకుని జీవిస్తున్నాడు. శుక్రవారం మిషన్ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి బైక్‌పై తిరిగివస్తుండగా ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని వేగంగా ఢీకొన్నాడు. దీంతో అతని ఛాతీకి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాకో విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన విగ్రహం

దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున గల శ్రీపద్మల్‌పురి కాకో ఆలయ ఆవరణలోని కాకో విగ్రహాన్ని గంగాపూర్‌కు చెందిన మతిస్థిమితం లేని లక్ష్మణ్ శనివారం ధ్వంసం చేశాడు. విషయం తెలుసుకున్న ఆలయకమిటీ సభ్యులు వెంటనే అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



మంటలార్పుతున్న గ్రామస్తులు

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైంది. రైతు గంగిరెడ్డి రాగయ్య ఇంట్లో సుమారు వంద క్వింటాళ్ల పత్తి నిల్వ చేసుకున్నాడు. శనివారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో పత్తికి మంటలు అంటుకున్నాయి. గమనించిన రైతుతోపాటు చుట్టుపక్కల వారు నీళ్లు పోసి మంటలార్పివేశారు. ఈప్రమాదంలో సుమారు 30 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైంది. రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.


యువతిని మోసగించిన యువకుడు?

బోథ్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు, అదే గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసినట్లు తెలుస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంతకాలంగా యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అయితే పెళ్లికి నిరాకరించడంతో యువతితోపాటు కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

శివానంద్ గీసిన కార్టూన్లు







కార్టూన్ శివా'నందం'

• కళారంగంలో ప్రతిభ
• రచయిత, కవి, జర్నలిస్టుగా గుర్తింపు

బెల్లంపల్లి: ఆయనో బహుముఖ ప్రజ్ఞాశాలి. కార్టూనిస్ట్, రచయిత, కవి, జర్నలిస్టు, కళాకారుడిగా ప్రత్యేకత చాటుకుంటున్నాడు నూతి శివానంద్. కార్మికక్షేత్రం బెల్లంపల్లిలో పుట్టి పెరిగిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. తనదైనశైలిలో గీసిన కార్టూన్ బొమ్మలతో అందరినీ ఆలోచింపజేస్తున్నారు. చిలిపిచేష్టల కార్టూన్ బొమ్మలు, పదునెక్కిన పదాలతో వీక్షకులను ఆకట్టుకుంటున్నాడు. తాజాగా ఆలిండియా తెలుగు కార్టూనిస్ట్‌ల డైరెక్టరీలో చోటు సంపాదించుకుని మరో మెట్టుకు ఎదిగారు. కొన్నాళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నానికి చెందిన లాల్ పేరుతో కార్టూన్స్ వేసే సదాశివుని లక్ష్మణ్‌రావు అనే సీనియర్ కార్టూనిస్ట్ ఆ డైరెక్టరీని రూపొందించారు. అంతటి ప్రాధాన్యత కలిగిన ఆ డైరెక్టరీలో ఇప్పటివరకు దాదాపు వంద మంది వరకు మాత్రమే అవకాశం దక్కగా వీరిలో శివానంద్ ఒకరు. ప్రస్తుతం ఓ ప్రైవేట్ టీవీ ఛానల్ ఆధ్వర్యంలో వెలువడుతున్న మాసపత్రికలో ఎడిటర్‌గా పనిచేస్తూనే సామాజిక సమస్యలపై కార్టూన్లు గీస్తూ జన జాగృతికి పాటుపడుతున్నారు.

కరోనా సమయంలో..

2019–21 వరకు రెండేళ్లలో కరోనా మహమ్మారి విజృంభించింది. ఆ సమయంలో ప్రజలకు అవగాహన కల్పించడానికి శివానంద్ ఎన్నో కార్టూన్లు గీసి అధికారుల మన్ననలు పొందారు. వైద్య ఆరోగ్య, ఇతర శాఖల అధికారులు కరోనాపై అవగాహన కల్పించడానికి పలువురి నుంచి కార్టూన్లు సేకరించి సీడీల రూపంలో విడుదల చేశారు. ఇందులో శివానంద్ వేసిన కార్టూన్లు ఉన్నాయి. అదేతీరుగా వివిధ సంస్థలు, పత్రికలు నిర్వహించిన కార్టూన్ పోటీల్లో ఆయన బహుమతులు గెలుచుకున్నారు. తొలుత పూర్తిపేరుతో కార్టూన్స్ వేసిన శివానంద్ ప్రస్తుతం తన ఇంటిపేరైన 'నూతి 'పేరుతో గీస్తున్నారు.



అవార్డు అందుకుంటున్న శివానంద్ (ఫైల్)

నటుడిగా ప్రత్యేక గుర్తింపు

శివానంద్ కొంతకాలం జర్నలిస్టుగా పనిచేశారు. ఆ తర్వాత సినీ, టీవీ రంగాల వైపు దృష్టిసారించారు. నటుడిగా, రచయితగా ప్రత్యేక గుర్తింపు పొందారు. సినీ దర్శకులు కె.రాఘవేందర్‌రావు, పి.చంద్రశేఖర్ రెడ్డి, అల్లాణి శ్రీధర్ మరికొందరి వద్ద కోడైరెక్టర్‌గా పనిచేశారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పలు లఘుచిత్రాలు, సీరియల్స్, డాక్యుమెంటరీలకు రచన, దర్శకత్వం వహించారు. పాటలు రాసి పాడారు. ప్రైవేట్ టీవీ ఛానెల్‌లో ప్రసారమైన అభిషేకం సీరియల్‌కు మాటలు రాసి దివంగత దర్శకరత్న దాసరి నారాయణరావు చేతుల మీదుగా ఉత్తమ మాటల రచయితగా అవార్డు అందుకున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వేంకటేశ్వర భక్తి చానెల్‌లో ప్రసారమైన పురాణగాథలు, సీరియల్స్‌కు ప్రధాన బాధ్యతలు నిర్వహించారు. తన ప్రతిభతో అంచెలంచెలుగా ఎదిగి సేవలందిస్తున్న శివానంద్‌ను పలువురు అభినందిస్తున్నారు.

ఆనందంగా ఉంది



చిన్నతనం నుంచే కళారంగం, రచనలు చేయడం అలవాటు. చదువుకునే రోజుల్లో ఎన్నో నాటకాలు రాశా. ప్రత్యేకంగా ఓ సాంస్కృతిక రంగాన్ని ఏర్పాటు చేసి ఎందరో కళాకారులకు అవకాశం కల్పించా. కార్టూన్ రంగంలోనూ రాణిస్తుండటం ఆనందంగా ఉంది. సమాజ రుగ్మతలపై కార్టూన్లు గీస్తూ జన చైతన్యానికి పాటుపడటం నాకెంతో ఇష్టం.

– నూతి శివానంద్, కార్టూనిస్టు

36 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత



లారీలో బియ్యం పరిశీలిస్తున్న డీసీఎస్వో కిరణ్‌కుమార్, ఏఎస్పీ అవినాష్‌కుమార్

• కారును ఢీకొనడంతో అక్రమ రవాణా వెలుగులోకి..
• సీజ్ చేసి ఎంఎల్ఎస్ గోదాంకు తరలించిన పోలీసులు

భైంసాటౌన్: మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి భైంసా మీదుగా మహారాష్ట్రలోని గోండియాకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 36 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని నిర్మల్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి ధర్మాబాద్ వైపు నుంచి వచ్చిన లారీ యూటర్న్ తీసుకుంటున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులోని వ్యక్తికి తీవ్రగాయాలు కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సదరు లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించడంతో అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారమివ్వగా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్‌తోపాటు ఏఎస్పీ అవినాష్‌కుమార్ శనివారం ఉదయం బియ్యాన్ని పరిశీలించారు. అవి పీడీఎస్ బియ్యమేనని సివిల్ సప్లయ్ అధికారి ధ్రువీకరించడంతో స్వాధీనం చేసుకుని, స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు లారీ డ్రైవర్ మహ్మద్ ఇసాక్‌తోపాటు బియ్యం తరలిస్తున్న ధర్మాబాద్‌కు చెందిన అబ్దుల్ రవూఫ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



పట్టుబడిన లారీ

పట్టుబడింది పీడీఎస్ బియ్యమే..

ధర్మాబాద్ నుంచి లారీలో తరలిస్తూ పట్టుబడింది పీడీఎస్ బియ్యమేనని సివిల్ సప్లయ్ శాఖ టాస్క్‌ఫోర్స్ రాష్ట్ర బృందం అధికారులు స్పష్టం చేశారు. శనివారం రాత్రి ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఉంచిన పట్టుబడిన బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధర్మాబాద్ నుంచి గోండియాకు తరలిస్తున్నట్లు చెబుతున్న మాట అవాస్తవమని, పట్టుబడిన బియ్యంలో ఎఫ్ఆర్‌కె(ఫోర్టిఫైడ్ రైస్ కర్నెల్స్) ఉన్నట్లు గుర్తించామన్నారు. దీనిపై పోలీసు శాఖ విచారణ జరుపుతోందని, తాము సైతం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందంలో ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ శేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, తదితరులున్నారు. వారి వెంట డీసీఎస్‌వో కిరణ్‌కుమార్, డీటీ ప్రకాశ్, ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ బాపురావు ఉన్నారు.

ట్రిపుల్‌ఐటీలో 'డిజైన్ ఫ్లై ది డ్రోన్స్' వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో నిపుణులు, తదితరులు

బాసర: ఆర్జీయూకేటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, టీహబ్ ఐఐటీ హైదరాబాద్ సహకారంతో శనివారం ట్రిపుల్ ఐటీలో 'డిజైన్ ఫ్లై ది డ్రోన్స్'పేరిట ఐదు రోజుల వర్క్‌షాప్‌ను ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఏవో రణధీర్ సాగితో కలిసి వీసీ, ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో డ్రోన్ టెక్నాలజీలో అధునాతన పరిజ్ఞానంతో ఆవిష్కరణలు, పరిశోధన గురించి ప్రముఖ నిపుణులు డాక్టర్ కె.కృష్ణనాయక్, కేవీ ఈశ్వరమూర్తి, కె.నాగరాజు, సంతోష్‌లు విద్యార్థులకు వివరిస్తారని తెలిపారు. డ్రోన్ పరిణామం, రకాలు, ఏరో డైనమిక్స్ తదితర అంశాలను తెలియజేస్తారని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా డ్రోన్ టెక్నాలజీ, సంబంధిత రంగాల్లో విద్యార్థుల కెరీర్ అవకాశాలు మెరుగుపరుస్తుందని కోఆర్డినేటర్ రాకేశ్ తెలిపారు. అసోసియేట్ డీన్స్, హెచ్‌ఓడీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న నిపుణుడు

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన రాజేశ్వర్ బైక్ ఈనెల 2న చోరీకి గురైంది. బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేశారు. శనివారం వాహన తనిఖీల్లో భాగంగా పట్టణంలోని తిర్పెల్లి శ్మశానవాటిక సమీపంలో పోలీసులు తనిఖీ చేస్తుండగా బైక్‌ను ఎత్తుకెళ్లిన ఇద్దరు దుండగులు పోలీసులను చూసి వాహనాన్ని వదిలి పారిపోయారు. వారిని వెంబడించి పట్టుకుని విచారించగా బైక్‌ను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా కోర్పణకు చెందిన షేర్క్యారే ప్రదీప్, నాగ్‌బిడ్‌కు చెందిన జాగేశ్వర్ నాన్నావర్ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. సీఐ వెంట ఎస్సైలు అశోక్, పద్మ, సతీశ్ తదితరులు ఉన్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

సమస్యలు పరిష్కరించాలి



ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న అధికారులు సంఘం నాయకులు

జైపూర్: సింగరేణిలో అధికారుల సమస్యలు పరిష్కరించాలని అధికారుల సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్ కోరారు. శనివారం ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పీఆర్‌పీ 2022–23 సంవత్సరానికి సంబంధించిన కోలిండియాలో జూన్ 2024లో చెల్లించినట్లు తెలిపారు. సింగరేణిలో చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సంస్థ భవిష్యత్తుకు పాటుపడాలని, అలాగే ఫంక్షనల్ డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు. అధికారుల సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

కొడుకు మందలించాడని తండ్రి ఆత్మహత్య



శంకర్ మృతదేహం

కడెం: కన్నకొడు కు మందలించాడని తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘట న మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన కొత్తూరి శంకర్(49)కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య కుమారుడు మణికంఠ గత కొన్నిరోజులుగా భూమి పంపకం చేయాలని తండ్రిని కోరుతున్నాడు. ఈ విషయమై ఈనెల 7న మణికంఠ తండ్రి శంకర్‌తో గొడవపడ్డాడు. మనస్తాపం చెందిన శంకర్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కలప లారీ పట్టివేత

కుంటాల: మండలంలోని అంబుగామ అటవీ ప్రాంతం నుంచి భైంసాకు తరలిస్తున్న కలప లారీని శనివారం రాత్రి మెదన్‌పూర్ గ్రామస్తులు పట్టుకున్నారు. ఈ విషయమై ఎఫ్‌బీవో హరిలతను వివరణ కోరగా.. పట్టాభూమి నుంచి రైతుల వద్ద కొనుగోలు చేసిన కలపను తరలిస్తున్న వాహనానికి అనుమతులు ఉన్నాయని తెలిపారు. అనుమతి పత్రాల్లో కలప తరలించి తేదీని దిద్దినట్లుగా ఉండడంతో లారీని అడ్డుకున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలప లారీని భైంసా అటవీశాఖ కార్యాలయానికి తరలించామని ఎఫ్‌బీవో తెలిపారు.

ప్రైవేట్ హాస్టల్ వార్డెన్‌పై కేసు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రైవేట్ హాస్టల్ వార్డెన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ప్రైవేట్ పాఠశాలలో సంతోష్ 6వ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. విద్యార్థి చదవడం లేదని శుక్రవారం వార్డెన్ నిరంజన్ అతన్ని కొట్టాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు వార్డెన్ నిరంజన్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఇచ్చోడ: మండలంలోని జున్ని ఎక్స్‌రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం..మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జివితి గ్రామానికి చెందిన గాయక్వాడ్ అంకుస్, జ్యోతి (29) భార్యభర్తలు. వీరికి అథీప్, అనన్య సంతానం. వీరందరూ కలిసి ఇచ్చోడ మండలంలోని జున్ని గ్రామంలో సమీప బంధువుల ఇంటికి వెళ్లేందుకు బస్సులో బయల్దేరారు. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు జున్ని ఎక్స్‌రోడ్డు వద్ద దిగారు. 44వ జాతీయరహదారి గుండా నడుచుకుంటూ వెళ్తుండగా నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన జ్యోతి అక్కడికక్కడే మృతిచెందింది. గాయాలైన అంకుస్‌ను స్థానికులు అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో మునిగి కాపరి..

లక్ష్మణచాంద: గొర్రెలను కాపాడడానికి వెళ్లిన కాపరి చెరువులో మునిగి మృతి చెందాడు. మండలంలోని రాచాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాచాపూర్‌కు చెందిన దొంతుల రాజేశ్వర్ (42) శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని చెరువులో గొర్రెలను నీళ్లు తాగించడానికి తీసుకెళ్లాడు. అక్కడ చెరువులో లోతు ఎక్కువగా ఉండడంతో గొర్రెలు మునిగాయి. గమనించిన రాజేశ్వర్ వాటిని కాపాడేందుకు చెరువులో దిగి నీట మునిగి మృత్యువాతపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్థానికుల సహాయంతో మృతదేహం బయటకు తీయించారు. ఎస్సై సుమలత సంఘటన స్థలాన్ని చేరుకుని వివరాలు సేకరించారు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

చికిత్స పొందుతూ మహిళ..

పెంబి: పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పోచంపల్లికి చెందిన మాలవత్ సానుక (22), విజయ్ భార్యాభర్తలు. భర్త విజయ్ వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 3న మొక్కజొన్న పంటకు నీళ్లు పట్టుమని విజయ్ తన భార్యకు చెప్పాడు. ఈక్రమంలో భార్యభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. మనస్తాపం చెందిన సానుక.. మొక్కజొన్న పంట వద్దకు వెళ్లి గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. అక్కడ ఉన్న స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఆమెను నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజాము మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి రెండేళ్ల వయసు గల కుమారుడు ఉన్నాడు.

శిలాజ సంపద ధ్వంసం



తాబేలు నత్తగుల్ల ఆకారంలో శిలాజ అవశేషాలు

వేమనపల్లి: అపురూపమైన శిలాజ సంపద అక్రమార్కుల ఆగడాలతో అంతరించిపోతుంది. మండలంలోని సుంపుటం ప్రాణహిత రేవు ప్రాంతంలో రాజకీయ నాయకుల అండదండలతో గత మూడు రోజులుగా శిలాజ సంపదను ధ్వంసం చేస్తున్నారు. నది తీరం వెంట దశాబ్దాలుగా నత్తగుల్ల, తాబేలు, చేప, వృక్ష శిలాజాలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రాణహిత నది వరదతో ఉన్నప్పుడు ఇవి పూర్తిగా నీటిలో మునిగి ఉంటాయి. చలి, ఎండకాలాల్లో ఒడ్డున తేలి ఉండటంతో వీటిని తిలకించేందుకు దూరప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారు. గత మూడు రోజులుగా బెల్లంపల్లికి చెందిన కొందరు వాటిని ధ్వంసం చేస్తున్నారు. వీటిని మత్తడి వాగు వంతెన వద్ద నిర్మాణంలో ఉన్న అప్రోచ్‌రోడ్డు రివిట్‌మెంట్ కోసం ఉపయోగిస్తున్నారు. రోడ్డు కోతకు కాకుండా నాణ్యమైన బండరాళ్లతో రివిట్‌మెంట్ చేయాలి. కాని అరుదైన శిలాజ అవశేషాలను శిథిలం చేస్తున్నారు. పెద్ద సమ్మెటలు(మొలలు) ఉపయోగించి శిలాజ అవశేషాల ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. వాటిని ట్రాక్టర్ల సహాయంతో మత్తడి వాగు వంతెన వద్దకు తరలిస్తున్నారు.



ట్రాక్టర్లలో తరలిస్తున్న శిలాజ రాళ్లు

అడ్డుకున్న గ్రామస్తులు

ప్రాణహిత నది తీరం నుంచి శిలాజ సంపదను అక్రమంగా తరలిస్తుండగా సుంపుటం గ్రామానికి చెందిన కొందరు యువకులు అడ్డుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో శిలాజ రాళ్లను తరలిస్తున్నట్లు మరో వర్గానికి చెందిన కొందరు నాయకులు అడ్డుకున్నారు. దీంతో వంతెన కాంట్రాక్ట్ సిబ్బంది రంగంలోకి దిగి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డట్లు సమాచారం. విషయం అధికారులు ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి అరుదైన శిలాజసంపదను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

నార్నూర్: విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ డీడీ జాదవ్ వసంతరావు అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థిని మౌనిక షాట్‌పుట్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో ఆమెను సన్మానించారు. క్రీడాపోటీల్లో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించడంలో కీలకపాత్ర పోషిస్తున్న పీడీ విశ్వనాథ్‌ను అభినందించారు. ఆయన వెంట హెచ్ఎం విట్టల్, వార్డెన్ వనిత తదితరులు ఉన్నారు.



మౌనికను సన్మానిస్తున్న వసంతరావు

విశ్వశాంతి యాగానికి ఏర్పాట్లు



ముస్తాబవుతున్న యాగశాల

నస్పూర్: పట్టణ పరిధిలో నిర్వహించే 86వ విశ్వశాంతి మహాయాగానికి చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో శ్రీవైష్ణవ ఆయుత చండీ అతిరుద్రం, శ్రీసీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ఈ నెల 15 నుంచి మార్చి 3 వరకు నిర్వహించనున్నారు. ఈమేరకు సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారి ప్రక్కన యాగశాలను ఏర్పాటు చేస్తున్నారు. యాగశాల వద్ద పదివేల చండీ పారాయణములు, వెయ్యి హోమ గుండాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతీరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా 24 గంటలు అహోరాత్ర అభిషేకములు, విశేష ఏకాదశ రుద్ర హోమము, లక్ష పార్థివ లింగార్చన, కోటి బిల్వార్చన, పుష్పార్చణ, శ్రీఉమామహేశ్వర దివ్య కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. యాగశాల వద్ద ప్రత్యేకంగా 50 అడుగుల శివ లింగం, కోదండ రామాలయం, గోవర్ధనగిరి శ్రీకృష్ణుని తాత్కాలిక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.